
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5★★★
శుక్రవారం 1 మార్చి 2024



ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి 8లో..

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు పరిశీలన 7లో..

మెగా డీఎస్సీ వచ్చేసింది..

- ఉపాధ్యాయ కొలువులపై ఆశలు
- జిల్లాలో 151 పోస్టుల భర్తీకి అవకాశం
- ఆరేళ్లుగా టెట్ అర్హత అభ్యర్థుల నిరీక్షణ
- జిల్లాలో 10 వేల మంది అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆరేళ్లకు పైగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఉత్తీర్ణులై కొలువుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు కొత్త ప్రభుత్వం ఊరటను ఇచ్చింది. ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో టెట్ అర్హత అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపు పది వేల మందికి పైగా ఉపాధ్యాయ అర్హత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులు మెగా డీఎస్సీకి సిద్ధం కావడానికి సన్నద్ధమయ్యారు. 2015లో ఉపాధ్యాయ నియామకాల కోసం టెట్ నిర్వహించారు. 2017లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారు. ఆ తరువాత దాదాపు ఆరేళ్లు దాటిపోయిన ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.



టెట్ రాస్తున్న అభ్యర్థులు (ఫైల్)

గత సంవత్సరం ఎన్నికల సమయంలో సెప్టెంబరు 6న 5,089 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇదే సమయంలో సెప్టెంబరు 16న మరోసారి టెట్ అర్హత పరీక్ష నిర్వహించింది. టెట్‌కు రెండు పరీక్షలకు 5,525 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2022 జూన్ 12న నిర్వహించిన పరీక్షల్లో కూడా 12 వేల 781 మంది హాజరవగా 80 శాతం వరకు అర్హత సాధించారు. టెట్ స్కోరు సాధించిన వారు ఏడేళ్ల వరకు ఉపయోగించుకునే అవకాశం ఉంది. సంవత్సరానికి రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా గత సంవత్సరం టెట్ నిర్వహించినా ప్రభుత్వం మారిపోయింది.

గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా నియామకాలు జరగలేదు. ప్రస్తుతం ప్రభుత్వం గతంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేస్తూ తాజాగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు డీఎస్సీ దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు రుసుము రూ వెయ్యి నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 నగరాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో డీఎస్సీకి అప్లయ్ చేసుకున్నా వారు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవసరం లేదని ప్రభుత్వం పేర్కొనడం గత అభ్యర్థులకు కొంత ఊరటనిచ్చింది.

పుస్తకాలతో మళ్లీ కుస్తీ

ఉపాధ్యాయుల కొలువుల కోసం నిరీక్షిస్తున్న డీఎస్సీ అర్హులు నోటిఫికేషన్ ముందు నుంచే పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో వందలాది మంది నిరుద్యోగులు డీఎస్సీతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. మరికొందరు కోచింగ్ కోసం హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు కూడా వెళుతున్నారు. దాదాపు అరున్నరేళ్లుగా బీఈడీ, డీఈడీ, డీఈఐఈడీ, లాంగ్వేజ్ పండితులు డీఎస్సీ కోసం ఎదురు చూస్తూ నోటిఫికేషన్ వెలువడడంతో మళ్లీ ఉపాధ్యాయ కొలువులపై ఆశలు మొదలయ్యాయి



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

అత్యధికంగా ఉపాధ్యాయ పోస్టులే..

గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో రాష్ట్రంలో రెండు మల్టీజోన్‌లు ఏర్పాటు చేయగా మొదటి మల్టీ జోన్‌లో కాళేశ్వరం, బాసర, రాజన్న జోన్‌లు ఉన్నాయి. రాజన్న జోన్‌లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి. 2022 సంవత్సరంలో ఉద్యోగ ఖాళీల్లో రాజన్న జోన్‌లో 2,403 ఉద్యోగ ఖాళీలు చూపించగా సిరిసిల్ల జిల్లాలో 601 పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా ఉపాధ్యాయ పోస్టులే ఉన్నాయి. గురువారం కొత్త ప్రభుత్వం తాజాగా 11,062 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్‌లు 2,629, భాషా పండితులు 727, పీఈటీలు 182, ఎస్‌జీటీలు 6,508, ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ 220, ఎస్‌జీటీలు 796 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో రాజన్నసిరిసిల్ల జిల్లాలో 151 పోస్టులు ఉన్నాయి. జిల్లాలో 534 పాఠశాలలు ఉండగా 2,352 ఉపాధ్యాయ పోస్టులున్నాయి. ఇందులో ప్రస్తుతం 1,979 మంది పనిచేస్తున్నారు. 373 పోస్టులు ఖాళీలు ఉండగా బదిలీలు, పదోన్నతులు, సర్దుబాటు పోను గత ప్రభుత్వం 103 ఖాళీలను చూపుతూ డీఎస్సీ ద్వారా భర్తీకి సిద్ధమయ్యింది. ప్రస్తుతం పోస్టులను పెంచుతూ తాజాగా వచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 151 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు 56, లాంగ్వేజ్ పండిట్‌లు 12 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు నాలుగు, సెకండరీ గ్రేడ్ టీచర్లు 67, స్పెషల్ గ్రేడ్‌లో స్కూల్ అసిస్టెంట్లు మూడు, సెకండరీ గ్రేడ్ టీచర్లు తొమ్మిది మంది కలిపి నియామకాలు జరగనున్నాయి.

కలెక్టరేట్‌లో 'కిరణం' కేంద్రం

- హెల్ప్‌లైన్ నెంబర్ 18004253333

సిరిసిల్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉరుకుల పరుగుల జీవితంలో వ్యక్తిగత, విధి నిర్వహణలో పని ఒత్తిడితో మానసిక ఒత్తిడికి గురవుతున్న వారికి ఒత్తిడిని దూరం చేయడానికి కలెక్టరేట్‌లో కిరణం కేంద్రాన్ని ఏర్పాటు చేశామని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువత మానసిక సమస్యలతో బాధపడే అందరికి ఒత్తిడిని దూరం చేయడానికి హెల్ప్‌లైన్ కేంద్రం నంబర్ 18004253333 నంబర్ అందుబాటులో ఉంచామని అన్నారు. డాక్టర్ నయీం జహా ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ కేంద్రం పనిచేస్తుందని విద్యార్థులు, యువతతో పాటు అందరూ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కేంద్రంలో సైక్రియార్టిస్ట్, సైకో థెరపిస్ట్, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. మద్యం, గుట్కా, ఇతర చెడు అలవాట్లను దూరం చేయడానికి కూడా కేంద్రం ఉపయోగడపడుతుందని అన్నారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించడంలో మానసిక ఇబ్బందులు ఉంటే కేంద్రం సహాయాన్ని పొందాలని కోరారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు 3న 5కె రన్: ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 29: జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం మార్చి 3న సిరిసిల్లలో 5కె రన్ నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 5కె రన్‌లో ఆసక్తి గల యువతీ, యువకులు, విద్యార్థులు, ఉద్యోగస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇందుకోసం జిల్లా పోలీసు కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. యువత మంచి భవిష్యత్ కోసం ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కృషిచేయాలన్నారు. 5కె రన్‌లో పాల్గొనే వారు ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్దకు రావాలని ఆయన తెలిపారు. 5కె రన్‌లో మొదటి మూడు బహుమతులు పోలీస్, పాత్రికేయులు, సిటీజన్స్, మిగితా మండలాల వారికి బహుమతులు అందజేస్తామన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, అలవాటు పడిన వ్యక్తుల మానసిక స్థితి, మానవ జీవితంపై చూపే ప్రభావం, నాడీవ్యవస్థ తీరుపై నిపుణులైన వైద్యులతో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పిస్తామని ఎస్పీ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం



సిరిసిల్లలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ద్వారం వద్దనే విద్యార్థులను తనిఖీలు చేశాకే లోనికి అనుమతించారు. జిల్లాలో 18 కేంద్రాల ద్వారా పరీక్షలను పకడ్బందీగా అధికారులు నిర్వహించారు. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 3,333 ఉండగా ఒకేషనల్ విద్యార్థులు 446 మంది పరీక్షలు రాయడం కోసం ఏర్పాట్లు చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మొదటి రోజు 3,333 మందికి 3245 మంది విద్యార్థులు హాజరుకాగ 88 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 446 మందికి గాను 420 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్ బోర్డు అధికారి మోహన్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించిన యువతి



డి మనీషా

కోనరావుపేట, ఫిబ్రవరి 29: కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గు మనీషా అనే యువతి నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించింది. 2023 ఆగస్టు 10న నిర్వహించిన గురుకుల పాఠశాల, గురుకుల కళాశాలలో టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైంది. ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పీజీటీగా నియామకపత్రాన్ని తీసుకుంది. కాగా గురువారం ప్రభుత్వం ప్రకటించిన ఎమ్ఏ సోషల్‌లో జూనియర్ లెక్చరర్‌గా ఐదో ర్యాంకు ర్యాంక్, డిగ్రీ లెక్చరర్‌గా ఎమ్ఏ సోషల్‌లో 12 ర్యాంక్ సాధించింది. మనీషా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడంతో పలువురు అభినందించారు.

గురుకుల జూనియర్ లెక్చరర్స్‌గా ఇద్దరు ఎంపిక



కొలిపాక విష్ణు, చౌకి శ్రీకాంత్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: తెలంగాణ గురుకుల జూనియర్ లెక్చరర్స్ ఫలితాలను గురువారం వెల్లడించగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. సిరిసిల్ల పట్టణం 25వ వార్డుకు చెందిన కొలిపాక విష్ణు జూనియర్ లెక్చరర్ సివిక్స్ పోస్టు, చౌకి శ్రీకాంత్ జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్ పోస్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విష్ణు, శ్రీకాంత్‌లను 25వ వార్డు కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్ అభినందించారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట) ఫిబ్రవరి 29: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని హెడ్ కానిస్టేబుల్ పాష అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్ సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100 సంప్రదించాలన్నారు. సమావేశంలో కానిస్టేబుల్ సతీష్, హోంగార్డు నర్సింలు ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



డీపీవోను సన్మానిస్తున్న అధికారులు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 29: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా, పైప్‌లైన్‌ల లీకేజీ లేకుండా చూడాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయితీ కార్యదర్శులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో తగు చర్యలు చేపట్టా లన్నారు. జనహిత దరఖాస్తుల పెండింగ్, పీఎం విశ్వకర్మ దరఖాస్తుల సమస్యల పరిష్కారం, ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం, ప్లాంటేషన్, చెత్త సేకరణ, కార్యాలయాల నిర్వహణ తదితర అంశాలపై పంచాయితీ కార్యదర్శులతో చర్చించారు. అనంతరం డీపీవోను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రమేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేట, ఫిబ్రవరి 29: ఓటరు జాబితాను పక్కగా రూపొందించడమే లక్ష్యమని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియను కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు. గంభీరావుపేటలోని 61, 62, 63 పోలింగ్ స్టేషన్ పీఎస్ పరిధిలో ఓటరు జాబితా ఇంటి నంబర్లు వారీగా పరిశీలన జరిపారు. ఓటర్ల ఓటరు గుర్తింపు కార్డులను పరిశీలించి, ఆన్‌లైన్, వాటి వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు చనిపోయిన వారి ఓట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. జాబితా నుంచి ఓటరును తొలగించే ముందు బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి పరిశీలించిన తర్వాతే తొలగించాలని, ఓటర్ల పూర్తి వివరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బూత్‌స్థాయి అధికారులను తహసీల్దార్‌లు ప్రతీరోజు పర్యవేక్షించాలని, రోజు ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరించేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించి పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న ఇళ్ల సంఖ్య సర్వే చేసిన ఇళ్లు, కొత్తగా నమోదు చేయాల్సిన ఓటర్లు, శాశ్వతంగా తొలగించిన ఓటర్లు డూప్లికేట్ ఓట్లు ఓటరు కార్డులో సవరణలు మొదలగు అంశాలపై నివేదికలను ఈఆర్‌వో నెట్ ద్వారా సమర్పించాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ద్వారా సేకరించిన వివరాలను బీఎల్‌వో యాప్‌లో నమోదు చేసేలా చూడాలని అన్నారు. ఓటరు జాబితాలో ఒకే ఇంటిలో ఆరు కంటే ఎక్కువ ఓట్లు ఉంటే ప్రత్యేకంగా పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. ఒకే కుటుంబాలనికి చెందిన ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా తగినచర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ అన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ భూపతి, ఎంపీడీవో రాజేందర్, కలెక్టర్ పర్యవేక్షకులు శ్రీకాంత్, బీఎల్‌వోలు ఉన్నారు.



20ఎస్ఆర్ఎస్29 ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తాం

- చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ

సిరిసిల్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన బట్ట ఉత్పత్తి ఆర్డర్ల కోసం జీవో ఇచ్చి సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంపై తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్, ఆసాముల సమన్వయ కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ మంత్రి తుమ్మలను కలిసి వినతిపత్రం అందించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభం, ఉపాధిలేక కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బతుకమ్మ చీరల ఆర్డర్లు లేక పవర్‌లూం పరిశ్రమను యజమానులు మూసివేశారని కార్మికులు పనిలేక ఆర్థిక ఇబ్బందులతో కుటంబ పోషణభారమై ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ బతుకమ్మ చీరల ఉత్పత్తికి సంబంధించిన బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. యారన్ సబ్సిడీ, బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించాలని మంత్రిని కోరారు. మంత్రి స్పందించి పెండింగ్ బకాయిల చెల్లింపు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళతామని ప్రభుత్వ అర్డర్లకు సంబంధించిన జీవో ఇచ్చి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ, అసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, అశోక్, పోరండ్ల రమేష్, మండల రాజు, సిరిమల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: జిల్లాలో కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎన్ఎల్ఈపీ సమావేశంలో డాక్టర్ రజిత మాట్లాడారు. జిల్లాలో 26 మందికి కుష్టు వ్యాధికి చికిత్స జరుగుతుందన్నారు. ప్రతీ ఆశా కార్యకర్త ఇంటింటికీ తిరిగి పరీక్షలు జరపాలన్నారు. కుష్టు వ్యాధిని ముందే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చునన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించి వైద్యం చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కాశీనాథం, శ్రీనివాస్, సురేష్, బాలయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐని కలిసిన గౌడ సంఘం సభ్యులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను మండలకేంద్రానికి చెందిన గౌడ సంఘం సభ్యులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో గౌడ సంఘం అధ్యక్షుడు నాగుల ప్రదీప్‌గౌడ్, నాయకులు గంట అంజాగౌడ్, గంట వెంకటేష్‌గౌడ్, పుల్లయ్య గారి నారాయణ గౌడ్, పందిర్ల సత్తయ్య గౌడ్, గంట దేవగౌడ్ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని గురువారం సిరిసిల్లలో లేబర్ ఆఫీసర్‌కు టీఎస్ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ 60 సంవత్సరాలుపై బడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు ఆరువేల రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులకు రాష్ట్రస్థాయి సలహాబోర్డులో సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్స్ ఇతర బెనిఫిట్ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికుల అడ్డాల వద్ద కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ. 10 లక్షలు, సహజ మరణం పొందితే రూ. 5లక్షలు, పెండ్లి కానుక ఒక లక్ష రూపాయాలకు పెంచాలన్నారు. కార్మికుల పిల్లల చదువులకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని, కార్మికులకు పాత పద్ధతిలో కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు, ఇవ్వాలన్నారు. రేషన్‌కార్డు అధారంగానే మరణించిన కార్మిక కుటుంబాలకు ఫ్యామిలి సర్టిఫికెట్‌గా నిర్ణయించి పూర్తి బెనిఫిట్స్ అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- నీటి సరఫరా మోటార్ల రిపేరుకు నిధులు - అన్నపూర్ణ భోజన నిర్వహణకు రూ 16.58 లక్షలు - సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం

సిరిసిల్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న దృష్ట్యా నీటిఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కౌన్సిల్ నిర్ణయించింది. గురువారం చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్షతన సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. 12 అంశాలతో కూడిన ఎజెండాపై కౌన్సిలర్లు చర్చించారు. సిరిసిల్లలో నీటి సరఫరా నిర్వహణ కోసం రగుడు ఫిల్టర్ బెడ్‌లో నీటిని పంపింగ్ చేసే మోటార్ల మరమ్మతులకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. సిరిసిల్లలో ఐదు రూపాయలకే భోజనాన్ని అందించే అన్నపూర్ణభోజన వసతిని మరో సంవత్సరం పాటు కొనసాగించే విధంగా రూ 16.58 లక్షలు మంజూరు చేశారు. సిరిసిల్లలోని గాంధీ, అంబేద్కర్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, పోలీస్‌స్టేషన్ జంక్షన్లలో హైమాస్ట్ లైట్లు పాడైపోవడంతో వాటి స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు, మరమ్మతులకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. రాబోయే రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలు, మజీద్‌ల వద్ద మౌలిక వసతులు కల్పించడానికి రెండు లక్షల రూపాయలు మంజూరు ఇచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై చర్యలు జరిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ, పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

● సమస్యల పరిష్కారానికి కృషి..

- మున్సిపల్ కమిషనర్ లావణ్య

మున్సిపల్ నుంచి అందించే సేవల్లో ఏమైనా నిర్లక్ష్యం జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ లావణ్య అన్నారు. నూతనంగా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన లావణ్యను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణితో పాటు కౌన్సిలర్లు సన్మానించి స్వాగతించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ సిరిసిల్ల ప్రజలకు పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పార్కుల నిర్వహణ వంటి సేవల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తానన్నారు. మున్సిపల్‌కు చెల్లించాల్సిన ఇంటిపన్నులు వాణిజ్యపరమైన పన్నులు వంద శాతం చెల్లిస్తూ సిరిసిల్లను ఆదర్శవంతంగా నిలిపారని అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా నిలపాలన్నారు. ఇప్పటి వరకు 80 శాతం పన్నుల వసూలు జరిగిందని 15 రోజుల్లోనే పూర్తిస్థాయిలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పాలకవర్గ సభ్యులు కూడా సహాయసహకారాలు అందించాలన్నారు. తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తలను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి కమిషనర్‌కు పట్టణాభివృద్ధిలో పాలకవర్గం పూర్తిగా సహాయసహాకారాలు అందిస్తుందని అన్నారు.

● కరోనా కష్టకాలంలోనూ సేవలు..

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు కరోనా వంటి కష్టకాలంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా సేవలు అందించారని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులరాలు నగునూరి లక్ష్మి పదవీ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. లక్ష్మి ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో గురువారం వేంకటేశ్వర కల్యాణం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని గుట్టపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు. కోరుట్ల జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య - రాజేష్, ఎంపీపీ తోట నారాయణలు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కారుగూరి నర్సయ్య పాల్గొన్నారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 618క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. బుధవారం క్వింటాల్ పత్తి 7,400 పలికింది. ప్రస్తుతం మరో 150 రూపాయలు పెరుగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బందికి సీపీ రివార్డు


కానిస్టేబుల్‌కు నగదు రివార్డును అందజేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం/ వీణవంక, ఫిబ్రవరి 29: పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌కు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి నగదు రివార్డు అందజేసి అభినందించారు .మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన కుర్ర సురేష్ ఇంట్లో గొడవపడి పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి డయల్ 100 కు కాల్ చేశారు. సమాచారం అందకున్నా బ్లూకోల్ట్స్ సిబ్బంది 15 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను కానిస్టేబుల్ జైపాల్ తన భుజాన వేసుకుని సుమారు రెండు కిలోమీటర్ల మేర పొలాల గట్ల మీద పరిగెడుతూ గ్రామంలోకి తీసుకొచ్చాడు. అనంతరం అతడిని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించి ప్రాణాలను కాపాడారు. వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు పరిస్థితులకు అనుకూలంగా వ్యవహరించిన కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌లను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని వచ్చునూర్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఓ యువ కుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చునూర్ గ్రామానికి చెందిన బొంగాని రాజు(39) కొన్ని రోజులుగా నరాల బలహీనతతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా మనోవేదన చెందుతున్నాడు. రాజు భార్య తన తల్లిగారింటికి వెళ్లింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున రాజు తల్లి బొంగాని మల్లవ్వ చూసి స్థానికులకు తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఇల్లందకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని లక్ష్మాజిపల్లె గ్రామానికి చెందిన రావుల రాజుకు పోలీసులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేశారు. ఇటీవల అతడి సెల్‌ఫోన్ పోయింది. దీంతో అతడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సెల్‌ఫోన్ గుర్తించి రాజుకి అప్పగించారు.

మక్తపల్లివాసికి భారత సమ్మాన్ పురస్కారం


చింతం నరేందర్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని మక్తపల్లి గ్రామానికి చెందిన చింతం నరేందర్ ఇటీవల న్యూఢిల్లీలో విధానసభ స్పీకర్ శ్రీరాం నివాస్ గోయల్ చేతుల మీదుగా భారత సమ్మాన్ పురస్కారం అందుకున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన నరేందర్ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పలు ఇన్నోవేటివ్ జర్నల్స్ మార్కెట్లో విడుదల చేసినందుకు గాను చింతం నరేందర్‌ను ఈనెల 23న ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

అంజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
● నిధులు దుర్వినియోగం చేశాడని అభియోగం

మల్యాల, ఫిబ్రవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలం పాటల ఇన్‌చార్జిగా విధులు నిర్వహించిన కె.శ్రీనివాసాచారిని సస్పెండ్ చేస్తూ ఈవో. టి.వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం పరిధిలోని వ్యాపారులు చెల్లించిన టెండర్లకు సంబంధించిన రూ.37.90లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ సస్పెన్షన్ వేటు వేశారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారీగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వాటిని దుర్వినియోగం చేసినట్లు వారం రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు గురువారం సస్పెన్షన్ చేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఈవో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని లోతుగా విచారణ జరిపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను కోరుతున్నారు.

గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: రాష్ట్రంలోని గిరిజన క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన శాఖ అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆదిలాబాద్ జిల్లా బాలుర మోడల్ స్పోర్ట్స్ పాఠశాల(జాతర్ల), కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని బాలుర పాఠశాల, ఆదిలాబాద్ జిల్లా బాలుర పాఠశాల(ఊట్నూర్), మహబూబ్‌నగర్ జిల్లా కొత్తగూడ బాలుర పాఠశాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా బాలికల పాఠశాల, కొత్తగూడెం జిల్లా కాచనపల్లి బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. విద్యార్థుల వయస్సు 31-08-2024 నాటికి 9 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా దేహదారుఢ్య పరీక్షల అనంతరం ఎంపిక చేస్తారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మార్చి 4 నుంచి 6వరకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 90591 75379 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్లు రమణారెడ్డి, పీవీకే కిషోర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో న్యూరో డాక్టర్ల 8వ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లో గల భద్రకాళి ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలు తెలియచేశారు. శుక్రవారం రెనే ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్, లంబర్ డిస్క్ సర్జరీలు, చల్మెడ మెడికల్ కాలేజీలోని న్యూరో విభాగం ఆధ్వర్యంలో మెదడు, వెన్నుపాముకు సంబంధించిన లైవ్ సర్జరీలు ఉంటాయని తెలిపారు. న్యూరో విభాగంలో వచ్చిన అధునాతన వైద్యం గురించి లైవ్ సర్జరీల ద్వారా తెలుసుకుంటారని అన్నారు. మార్చి 2న సాయంత్రం నగరంలోని వీ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సు న్యూరో డాక్టర్లు, న్యూరో వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వేములవాడలో జాతర ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ ఫిబ్రవరి 29 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆలయ ఈఈ రాజేష్, డి ఈ రఘునందన్ లతో కలిసి ఆలయ పరిసరాలలో జాతర ఏర్పాట్లు పరిశీలించి అనంతరం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జాతర సందర్భంగా తాగునీటి సరఫరా, క్యూ లైన్ల నిర్వహణ, ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రం ప్రతిష్ఠాపన





పూజల్లో పాల్గొన్న భక్తులు, నాగేంద్ర సహిత మానసాదేవి విగ్రహాలు

కోరుట్ల, ఫిబ్రవరి 29 : పట్టణంలోని సత్య అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రస్థాపన కార్యక్రమాన్ని వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్, కపిల్‌శర్మ మంత్రోచ్ఛరణ మధ్య ఘనంగా సాగింది. ఈ సందర్భంగా వాస్తు దేవతా పూజలతో పాటు నాగేంద్ర సహిత మానసాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, నిర్వాహకులు గడ్డమీది రాజన్న, మక్కు ధర్మరాజు, దామోదర్ పాల్గొన్నారు.

ఈ నెల14న ఎస్‌యూలో కామర్స్ మీట్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ మల్లేష్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మార్చ్ 14న శాతవాహన వికల్ప2024 (కామర్స్ మీట్)ను నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ గురువారం కామర్స్‌మీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, పోటీతత్వం పెంపొందించుకోవటానికి శాతవాహన వికల్ప ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందుకే విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అన్ని డిగ్రీ,పీజీ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శాతవాహన వికల్ప-2024 కన్వీనర్ డాక్టర్ డి హరికాంత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే కామర్స్‌మీట్ వల్ల విద్యార్థులు వివిధ అంశాలపట్ల అవగాహన పెంచుకొని నూతన మెలుకువలు నేర్చుకోవచ్చని అన్నారు. కామర్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులకు తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ప్రేరణ-2024 రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, బి నరేష్, డాక్టర్ పరశురాములు, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్‌టీపీపీ స్టేజ్-1 నిర్మాణం సంపూర్ణం

● 800 మెగావాట్ల రెండో యూనిట్‌కు కమర్షియల్ ఆపరేషన్(సీవోడీ) ప్రకటన
● అందుబాటులో 1600 మెగావాట్లు ● 4న జాతికి అంకితం చేయనున్న ప్రధాని

జ్యోతినగర్, ఫిబ్రవరి 29: ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) స్టేజ్ 1 నిర్మాణం సంపూర్ణమైంది. ఈ ప్రాజెక్టులోని 800 మెగావాట్ల సామర్థ్యం గల 2వ యూనిట్‌ను గురువారం అర్ధరాత్రి(00.00 గంటలు) కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ)గా ప్రకటించారు. ఈ యూనిట్ పూర్తిస్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడం, సీవోడీ ప్రకటనతో మొత్తం 1600 మెగావాట్ల(800 మెగావాట్ల 2 యూనిట్లు) మొదటి దశ పూర్తయింది. 800 మెగావాట్ల 2వ యూనిట్‌కు సంబంధించి ఫిబ్రవరి 11న ట్రయల్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఐదు నెలల క్రితమే 800 మెగావాట్ల సామర్థ్యంగల 1వ యూనిట్‌ను సీవోడీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో టీఎస్‌టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేస్తారు. స్టేజ్-2లో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పాల్సి ఉంది. అయితే స్టేజ్ 2కు సంబంధించి కీలకమైన విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకోవాల్సి ఉంది. స్టేజ్ 2కు ఇప్పటికే ఎన్టీపీసీ బోర్డు(బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు) అనుమతి ఉంది. కాగా, మార్చి 4న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెకు స్టేజ్ 1ను జాతికి అంకితం చేయనున్నారు. 4న ప్రధాని ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా అక్కడి నుంచే వర్చువల్ విధానంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని సమాచారం.

● సుదీర్ఘ కాలం తరువాత

అనేక సవాళ్లు, అవాంతరాల తరువాత తెలంగాణ సూపర్ థర్మల్ ప్రాజెక్టు పూర్తయింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 4000 మెగావాట్ల ప్రాజెక్టును ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నెలకొల్పాలని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా 2016లో పునాదిరాయి పడి స్టేజ్-1 మొదట్లో వేగంగా నిర్మాణ పనులు జరిగినా కరోనా, సాంకేతిక కారణాల వల్ల తీవ్ర జాప్యమైంది. 2020-21లోనే ప్రాజెక్టులోని మొదటి, రెండవ యూనిట్లను పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించినప్పటికీ కరోనా, సాంకేతిక సమస్యలు రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. ఏడాదిన్నర కాలంగా ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగంగా చేయడం ద్వారా స్టేజ్ 1లో రెండు యూనిట్లు ఉత్పత్తి దశకు చేరాయి. రామగుండంలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) 800 మెగావాట్ల 2వ యూనిట్ ఉత్పత్తి దశలోకి రావడంతో ఎన్టీపీసీ సంస్థ స్థాపిత సామర్థ్యం 74,758 మెగావాట్లకు చేరింది.



తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు

యువకుడి ఆత్మహత్య



చొక్కాల అరవింద్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 29:తాను ప్రేమించిన అమ్మాయికి వేరే యువకుడితో వివాహం కుదరడంతో మనస్థాపం చెందిన చొక్కాల అరవింద్(20) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలం చింతలఠాణా గ్రామానికి చెందిన చొక్కాల లక్ష్మణ్-దేవవ్వ దంపతుల కుమారుడు చొక్కాల అరవింద్ అనే యువకుడు ఓ యువతిని కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. అయితే సదరు యువతికి వేరే అతనితో వివాహం కుదిరింది. తనను కాదని వేరే అబ్బాయిని వివాహం చేసుకుంటుందనే కోపం పెంచుకున్నాడు. దీంతో అరవింద్ సదరు అమ్మాయితో దిగిన ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయడంతో సమస్య పెద్దదైంది. హైదరాబాద్‌లో ఉన్న అరవింద్‌ను తండ్రి మందలించి ఇంటికి రావాలని కోరారు. ఇంటికి వస్తున్నానని చెప్పిన అరవింద్ వేములవాడ నందికమాన్ సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికి ఎదిగిన కొడుకు ప్రేమ విషయంలో మనస్థాపం చెంది మృతి చెందడంతో కన్నవారు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని గాలిపల్లి సమీపంలో కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరుల వివరాల ప్రకారం వల్లంపట్ల గ్రామానికి చెందిన దయ్యాల ఎల్లయ్య, ముద్దాల బాలయ్య, వట్టె ఎల్లయ్య, దయ్యాల లచ్చయ్యలు మేతకోసం గొర్రెలను గురువారం గాలిపెల్లి గ్రామ సమీపంలోకి తీసుకెళ్లారు. అటుగా వచ్చిన కుక్కలు గొర్రెలపై దాడిచేయడంతో 20గొర్రెలు, మేకలు మృతిచెందాయి. సంఘటనలో తమకు దాదాపు రూ. 1.5లక్షల నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్లకాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 29 : ముండలంలోని ఆవునూర్ పరిధిలో గల ఎగువమానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని ఠాణాకు తరలించినట్లు ఆర్‌ఐ శ్యాంకుమార్ గురువారం తెలిపారు. ఇసుక కోసం టోకెన్ తీసుకొని అనుమతి తీసుకున్న స్థలంలో కాకుండా వేరే చోటకు తరలిస్తుండగా పట్టుకొని ఠాణాకు పంపినట్లు తెలిపారు. ట్రాక్టర్లపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం





స్వామివారి రథోత్సవం, స్వామివారు (ఇన్‌సెట్‌లో)

బీర్‌పూర్,ఫిబ్రవరి 29: బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టం స్వామి వారి రథోత్సవం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని గుట్టపై నుంచి గుట్ట కిందికి ప్రత్యేకంగా అలంకరించిన శావపై ఆశీనుల గావించి డప్పు చప్పుళ్ల మధ్య గుట్ట కిందికి తీసుకవచ్చారు. రథం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని రథంపై ఆశీనులు గావించి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్ట కింద ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన ఆరుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు, పోలీసు సిబ్బందితో డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవర్ ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ జాతర బ్రహ్మోత్సవాలలో ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్ రావ్, బీర్‌పూర్ సింగిల్‌విండో చైర్మెన్ కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఆలయ కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కొల్మూల రమణ, మాజీ ఆలయ చైర్మెన్‌లు గోనే రమణ రావ్, నేరెల సుమన్, మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మధు కుమార్, చిన్న సంతోష్, క్లర్క్ రాజయ్య, సిబ్బంది వెంకటేష్, మల్లయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కస్టడీలో నందెల్లి మహిపాల్, కృష్ణగౌడ్

● కరీంనగర్‌లో సోదాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 29: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో ఈ నెల 20న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు గురువారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. అనంతరం నాలుగు ప్రత్యేక పోలీసు టీంలు ఏకకాలంలో జ్యోతినగర్, శర్మనగర్, ముకరంపురల్లో మహిపాల్ ఇళ్లతో పాటు అతడి అనుచరుల ఇళ్లు, కార్యాలయాల్లో 6 గంటల పాటు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నందెల్లి మహిపాల్ సమక్షంలోనే ఆయన ఇళ్లు, కార్యాలయంలలో సోదాలు జరిపారు. శుక్రవారం ఉదయం వరకు మహిపాల్ పోలీసుల కస్టడీలో ఉండనున్నారు.

● రేకుర్తిలోని ఒక భూమికి సంబంధించి నకిలీ ధ్రువపత్రాలను నిజమైనదిగా చూపించి బాధితుడి నుంచి కోటి 37 లక్షల రూపాయలు వసూలు చేసిన కేసులో నిందితుడిగా జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్‌ను గురువారం కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఈనెల 9న కృష్ణగౌడ్ అరెస్టు అయి జైలులో ఉండగా అతన్ని మరింత లోతుగా విచారించాలని పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా 24 గంటల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ మేరకు కృష్ణగౌడ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ జరుపుతున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.



నందెల్లి మహిపాల్‌ను కస్టడీకి తీసుకుని సోదాలకు వెళుతున్న పోలీసులు

భూ తగాదాల్లో తలదూర్చిన వ్యక్తిపై పీడీ యాక్ట్



పీడీ యాక్ట్ అమలు కాపీ అందజేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 29: భూ తగాదాల్లో తలదూర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన పి.రమణారెడ్డికి గురువారం వేములవాడ పోలీసులు పీడీయాక్టు నిర్బంధ ఉత్తర్వులు అందజేసి అమలుచేసి చర్లపల్లి జైలుకు తరలించారు. చంద్రంపేటకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి రిపోర్టర్‌గా పనిచేస్తూ భూ సమస్యలు, ఇతర సమస్యల్లో తలదూరుస్తూ అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని అతనిపై సిరిసిల్ల, తంగళ్లపల్లి, కోనరావుపేట, వేములవాడ పోలీస్‌స్టేషన్‌లలో దాదాపు 10కేసులు నమోదయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. అయినప్పటికీ అతని కార్యకలాపాలు మార్చుకోనప్పటికీ జిల్లా కలెక్టర్ అనురాగ్‌జయంతి పీడీ యాక్ట్ అమలు చేయడానికి ఉత్తర్వులు ఇవ్వగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు అతనికి పీడీ యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు టెట్ అర్హత మార్కులు తగ్గించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే అర్హత పరీక్ష(టెట్)లో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో అర్హత సాధించాలంటే, ముందుగా బీఈడీ, టీటీసీ చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధించాల్సి ఉందని తెలిపారు. ఈ పరీక్షలో ఓసీలు 90, బీసీలు 75, ఎస్సీలు 60 మార్కులు సాధించాలన్నారు. 89 సాధించిన ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఒక్క మార్కుతో వేల సంఖ్యలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. కావున ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు బీసీల మాదిరిగానే 75 మార్కులకే అర్హత కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించి ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

చందుర్తి, ఫిబ్రవరి 29: జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ నిరుపేద మృతి చెందగా మృతదేహం చందుర్తి మండలంలోని బండపల్లికి చేరుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతుగంటి భూమయ్య (46) గుండెపోటుతో ఫిబ్రవరి 3న గల్ఫ్‌లో మృతి చెందా డు. రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా గుం డెపోటు వచ్చింది. సహచరులు వెంటనే ఆసుపత్రి తరలిం చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతదేహం గ్రామానికి రావడంతో కుటుంబ సభ్యులు రోదించడం కంటతడి పెట్టించింది. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం కేసులో పెరుగుతున్న బాధితులు

మరో ఏడుగురి వద్ద రూ. 6లక్షల టోకరా

గంభీరావుపేట, ఫిబ్రవరి 29: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల ఆశతో మోసపోయిన బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 9 లక్షలు దండుకున్న ఘటన మరిచిపోక ముందే ఇదే కోవలో మరికొందరు వెలుగులోకి వచ్చారు. వీరిని మోసం చేసింది కూడా ఎర్రవెల్లికి చెందిన అర్జున్ కావడం విస్మయం కలిగిస్తోంది. ఉద్యోగాల పేరిట వరుస టోకరాలు చూస్తుంటే అర్జున్ చేతిలో ఇంకెంత మంది మోసపోయారనే అనుమానాలు బలపడుతున్నాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో పలువురు అమాయక యువకులను మోసం చేసిన వ్యక్తుల్లో ఒకరైన ఎరవెల్లికి చెందిన అర్జున్ గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు చెందిన మరో ఏడుగురిని ఇదే రకంగా మోసం చేశాడనే అంశం వెలుగు చూడటం కలకలం రేపుతోంది. అర్జున్ శివ పేరుతో సూర్య, సుజాత అనే వ్యక్తుల సహకారంతో లింగన్నపేటలో మరో ఘరానా మోసానికి తెరలేపాడు. దాదాపు లింగన్నపేటకు చెందిన ఏడుగురు వ్యక్తుల వద్ద కాస్ ఫౌండేషన్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో పెట్టించే అధికారులు సూర్య, సుజాత అంటూ వారిని పరిచయం చేస్తూ అర్జున్ అలియాస్ శివ పలు దఫాలుగా డబ్బు వసూలు చేశాడు. లింగన్నపేటకు చెందిన బాధితురాలు తండ్రి పురుషోత్తం గంభీరావుపేట ఎస్‌ఐ రాంమోహన్‌కు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నిందితుడైన అర్జున్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసులపై డీఎస్పీ విచారణ


ముస్తాబాద్, ఫిబ్రవి 29: ముస్తాబాద్ మండల పోలీసు ఠాణా పరిధిలో ఇటీవల నమోదైన అట్రాసిటీ కేసులపై సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ గురువారం విచారణ చేశారు. ఎస్టీ మహిళ పెట్టిన కేసుతో పాటు, పారిశుధ్య సిబ్బంది పెట్టిన అట్రాసిటీ కేసులపై క్షేత్ర స్థాయిలో డీఎస్పీ విచారణ చేశారు. ఏఎస్సై వెంకటరమణ, పీసీ కుమార్ ఉన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో 10న మంత్రి 'పొన్నం'కు సన్మానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో మార్చి 10న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మాన కార్యక్రమం ఉంటుందని జిల్లా గౌడ సంఘం నాయకులు తెలిపారు. గురువారం నగరంలోని మాచర్ల గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల గణన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పొన్నం ప్రభాకర్‌కు సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున గౌడ కులస్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాచర్ల ప్రసాద్, పొన్నం శ్రీనివాస్, పొన్నం సత్యం, జగన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్



సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయకార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం లబ్దిదారులకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూం లబ్దిదారులను గురువారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం జరిగి సంవత్సరాలు గడిచిపోయాయని, లబ్దిదారులను సైతం గ్రామసభల ద్వారా ఎంపిక చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్లను పంపిణీ చేయలేదన్నారు. ఓపిక నశించిన లబ్దిదారులు డబుల్‌బెడ్‌రూంలలో ఉంటున్నారని తెలిపారు. వారికి విద్యుత్ సరఫరా నిలిపివేయడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేయాలని లేనట్లయితే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘ జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, నాయకులు పసుల బాలరాజు, బైండ్ల మల్లేశం, మహేష్, నర్సవ్వ, రేణుక, లక్ష్మి, బాగ్యలక్ష్మి, చంద్రయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

● పల్లిమక్తలో చోరీ ● రూ.70 వేలు అపహరణ

కోనరావుపేట, ఫిబ్రవరి 29: తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతున్నారు. గత నెలలో కూడా సుమారు నాలుగు గ్రామాల్లో వరస దొంగతనాలు జరిగాయి. అది మరవక ముందే బుధవారం రాత్రి పల్లిమక్త గ్రామంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శనిగరం దేవవ్వ, నందగిరి వజ్రవ్వల ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో చోరీ చేశారు. తాళాలను పగలగొట్టి శనిగరం దేవవ్వ ఇంటిలో 70 వేల రూపాయలను అపహరించారు. నందగిరి వజ్రవ్వ ఇంటిలో కూడా తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంటిలో ఏమి దొరకలేదు. విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి దొంగతనం జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపడుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పల్లిమక్తలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

సిరిసిల్ల వస్త్ర సంక్షోభంపై దృష్టి పెట్టండి

- మాజీ మంత్రి కేటీఆర్‌కు సీఐటీయూ నాయకుల వినతి



కేటీఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర సంక్షోభాన్ని నివారించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కే తారకరామారావును సిరిసిల్ల సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రభుత్వం నుంచి బట్ట ఉత్పత్తి ఆర్డర్లు లేకపోవడంతో పవర్‌లూం పరిశ్రమ మూతపడిందని ఇప్పటికే మరమగ్గాలు నడవకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారినట్లుగా సీఐటీయూ నాయకులు వివరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు తోడ్పాడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, సిరిసిల్ల రవీందర్, అశోక్, పోరండ్ల రమేష్, మండల రాజు, సిరిమల్లె సత్యం ఉన్నారు.

పరీక్షల సమయంలో అదనపు బస్సులు నడిపించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: విద్యార్థుల పరీక్షల సమయానికి అనుకూలంగా ఆర్టీసీ డిపో నుంచి అదనంగా బస్సు సర్వీసులను నడిపించాలని సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్‌కు టీఆర్ఎస్వీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమైన్నాయని అన్నారు. పరీక్షా కేంద్రాలకు రావడం కోసం ఉదయం, పరీక్షలు పూర్తి అయ్యాక మధ్యాహ్నం స్వగ్రామాలకు వెళ్లడానికి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సుల సర్వీసులను నడిపించాలని డీఎంను కోరారు. జిల్లా పరిధిలోని గ్రామాల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు రావడం జరుగుతుందని విద్యార్థులు ఎక్కడ కనబడినా బస్సులు ఆపాలని వినతిపత్రం ద్వారా కోరామన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, రుద్రవేణి సుదీర్, వంశీ, గణేష్, కరుణాకర్, సందీప్, నవీన్, జగన్, నరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలపి జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య సూచించారు. గురువారం సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమరామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంను పురష్కరించుకొని సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ప్రముఖ దంత వైద్యుడు సత్యఅన్వేష్ మాట్లాడారు. విద్యార్థులో శాస్త్రీయ వైఖరులు పెంపొందించుకోవడానికి సైన్స్ వారోత్సవాలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పరిపూర్ణ వ్యక్తులుగా తయార అవుతున్నారని అన్నారు. ప్రజలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. సదస్సులో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామరాజు, రాష్ట్ర కార్యదర్శి సంతి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతిలాల్, స్టాఫ్ సెక్రటరీ మల్లారపు పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు గురువారం సైన్స్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన 66 రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మధుమాలతి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. సైన్స్‌పై ఆసక్తిని చూపించి మూఢనమ్మకాలు నమ్మద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు హాజు నాయక్, రమేష్ రెడ్డి, రామమనోహర్ రావు, సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎన్ఎస్‌యూఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సాయి ప్రసాద్‌యాదవ్ మాట్లాడారు. తెలంగాణ నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీపి కబురును అందించారని అన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయనుకున్న యువతను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీని ప్రకటించి నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. మెగా డీఎస్సీని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎన్ఎస్‌యూఐ కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా, మండలాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే రూ.500కే గ్యాస్ సిలిండర్, పేద ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి గ్యారెంటీలను అమలు పరచడం గర్వకారణమన్నారు. పేద ప్రజల కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించి సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు దేవరాజు, భూపాల్‌రెడ్డి, బాపురెడ్డి, నర్సింలు, బాలయ్య, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 29: ప్రజా ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృషిసారిస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన విప్ మోకాలి కీలుమార్పిడి శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులను అభినందించి రోగుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. వేములవాడ వంటి చిన్న పట్టణాలలో మోకాలు కీలుమార్పిడి చికిత్సలు విజయవంతంగా నిర్వహించడం ఆసుపత్రికి ఎంతో గర్వకారణమన్నారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు అవసరమయ్యే అన్ని సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకంతో రోగులు వస్తారని, ఆసుపత్రికి వచ్చే రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారిని ప్రేమగా పలకరిస్తూ మనోధైర్యాన్ని కల్పించాలని వైద్యులకు, సిబ్బందికి తెలిపారు. పేద ప్రజలు అప్పు చేసి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారని, అలా జరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచిందని గుర్తు చేశారు. వారి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేష్‌రావు, నాయకులు, వైద్యులు సిబ్బంది ఉన్నారు.



రోగుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న ఆది శ్రీనివాస్

● **బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

వేములవాడ: బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. చట్ట సభల్లో బీసీల వాటా సాధన కోసం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా పాదయాత్ర పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి అభివృద్ధికి కట్టుబడి ఉందని, బీసీల అభ్యున్నతికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న ముదిరాజ్ స్వగ్రామం మీర్గావ్ పల్లె నుండి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కోట కిలాసాపూర్ వరకు నిర్వహిస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కుల గణన బిల్లును అసెంబ్లీ సమావేశాలలో ఏకగ్రీవంగా ఆమోదించినందుకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక బోధనలు అభినందనీయం

వేములవాడ, ఫిబ్రవరి 29: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారి ఆధ్యాత్మిక బోధనలు అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంస్థ ఆధ్వర్యంలో వేములవాడలో ఏర్పాటు చేసిన త్రిమూర్తి శివజయంతి (శివరాత్రి) మహోత్సవాల్లో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామి వారి కృప, కరుణ, ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివ జయంతిని జరుపుకోవాలని ఆనవాయితీగా వస్తుందన్నారు. జ్ఞాన సూర్యుడైన శివ పరమాత్మ వర్తమాన సమయంలో ఈ సృష్టిపై అవతరించి మానవులలో అంధకారాన్ని తొలగిస్తున్నారని అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం వారు చేస్తున్న శాంతి బోధనలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదు

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి - కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం 6వ వార్డులో జరిగిన సమావేశంలో వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ గుండ్లపెల్లి రామానుజం తన అనుచవర్గంతో కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా కండవాలు వేసి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం బాగోతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బట్టబయలు చేసిందని కాళేశ్వరం అవినీతిపై కాగ్ నివేదిక ఇస్తే చర్చిదాం రమ్మంటే బీఆర్ఎస్ నాయకులు పారిపోయారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అవినీతి అక్రమాలు దోపిడీలు భూకబ్జాలను ప్రస్తావిస్తే కేసీఆర్, కేటీఆర్ కల్లుతాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారని ఆరోపంచారు. సిరిసిల్ల అంటేనే పద్మశాలీలు అని అలాంటి సిరిసిల్ల పద్మశాలీల బతుకులను కేటీఆర్ రోడ్డుకీడ్చాడని అన్నారు. కేటీఆర్ ఆయన అనుచరవర్గం సిరిసిల్లలో బతుకమ్మ చీరల మాఫియా, ఇసుక మాఫియా, గంజాయి మాఫియాను పెంచి పోషించాడన్నారు. రెండు సంవత్సరాలుగా బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించలేదన్నారు. ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేసి దాదాపు లక్ష 70వేల ఎకరాలను ఈ రోజు ఎండబె డుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు వచ్చే పరిస్థితులు లేవన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని పార్లమెంట్ ఎన్నికల సమయం వరకు కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ప్రతీఒక్కరు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, కత్తెర దేవదాస్, నాయకులు వైద్య శివప్రసాద్, గుండ్లపెల్లి గౌతమ్, స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.



రామానుజంనకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

చందుర్తి, ఫిబ్రవరి 29: వార్షిక పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా శక్తి సామర్థ్యాలను పెంచేందుకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల ఒత్తిడిని ఎదుర్కోవాలంటే ముందుగానే పాఠ్యపుస్తకాలను అభ్యసించాలని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మొబైల్ ఫోన్‌లు, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు సరైన పోషకాహారం తీసుకోవాలని, సమయానికి నిద్రపోవా లన్నారు. నడక, యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత వస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సంపతఖ కుమార్, నిషా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 29 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మేజర్ గ్రామపంచాయతీ సిబ్బంది నర్సింహులు అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. నర్సింహులు అంత్యక్రియల కోసం రూ. మూడువేల ఆర్థిక సహాయాన్ని సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి వారి కుటుంబానికి అందించారు. నాయకులు పందిర్ల పర్శరాములు గౌడ్, ఎలగందుల నర్సింహులు, ఎడ్ల లక్ష్మణ్ ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత నడుం బిగించాలి

తంగళ్ళపల్లి, ఫిబ్రవరి 29: మాదక ద్రవ్యనిర్మూలనకు యువత, విద్యార్థులు నడుం బిగించాలని ఎస్ఐ సుధాకర్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న 5కె రన్ పోస్టర్‌ను మండలంలో వ్యవసాయ కళాశాల, షెడ్యూల్ తెగల గురుకుల డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యాపకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటి డ్రగ్ అవేర్‌నెస్‌లో భాగంగా మార్చి 3వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐతో పాటు కళాశాలల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి

చందుర్తి, ఫిబ్రవరి 29: అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు అన్నారు. మండలంలోని అనంతపల్లిలో గురువారం పౌరుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ ప్రదీప్, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, పోలీస్ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతను అలవర్చుకోవాలి

- జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: ప్రతీఒక్కరు ఆర్థిక అక్షరాస్యతను అలవర్చుకోవాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ర్యాలీని డీఈవో రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ మాట్లాడుతూ పబ్లిక్ ప్రదేశాలలో మొబైల్‌ను ఛార్జింగ్ పెట్టడం ద్వారా వ్యక్తిగత సమాచారం ఇతరులకు వెళ్లే అవకాశాలు ఉంటాయని అన్నారు. రిజర్వుబ్యాంక్ సూచనల ప్రకారం ప్రతీ సంవత్సరం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి ప్రస్తుతం డిజిల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారి అకౌంట్ వివరాలను, ఓటీపీలను ఎవరితోను పంచుకోవద్దని సూచించారు. అకౌంట్ వివరాలను, ఓటీపీలను ఎవరికైన తెలిపినట్లు అయితే సైబర్ నేరస్తులకు చేరుతాయని హెచ్చరించారు. విద్యార్థులు బ్యాంకు ఖాతాలను తెరిచి డబ్బులను అందులో పొదుపు చేసుకొని అవసరాలకు ఉపయోగపడే విధంగా ఆర్థిక అక్షరాస్యత పాటించాలన్నారు. పొదుపు చేయడం విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి టీఎస్ మల్లిఖార్జున్‌రావు, టీజీబీ రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, యూబీసీ చీఫ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, విద్యాధికారి రఘుపతి, డీహబ్ కోఆర్డినేటర్ రోజా, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఈవో రమేష్

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 29 : మార్చి 3వ తేదీన నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిని డా. స్రవంతి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లకు, అంగన్వాడీ టీచర్లకు పల్స్ పోలియో శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో 41 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో సిబ్బంది ప్రతీ ఇంటికి తిరిగి పల్స్ పోలియోపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా. స్వప్నలత, డా. చిరంజీవి, ఎమ్ఎల్‌హెచ్‌పీ స్నేహ, లక్ష్మీప్రసన్న, పిహెచ్ఎన్ రజని, సూపర్‌వైజర్లు మేరీ, పద్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి స్రవంతి

ముస్తాబాద్: మండలంలోని పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో, సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి బత్తుల గీతాంజలి నిర్వహించారు. మండలంలోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగనివాడీ టీచర్లకు గురువారం శిక్షణనిచ్చారు. మార్చి 3వ తేదీన పోలీయో కార్యక్రమం సందర్భంగా రెండు చుక్కల పోలియో డ్రాప్స్‌ను చిన్నారులకు వేసేలా చూడాలన్నారు. భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా మార్చేలా ప్రతీ ఒక్కరు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ముస్తాబాద్ మండల వ్యాప్తంగా 32 పల్స్ పోలియో కేంద్రాలును ఏర్పాటు చేసి 3221 మంది ఐదు సంవత్సారాలలోపు పిల్లలకు పోలీలియో చుక్కలు వేస్తామన్నారు. కార్యక్రమంలో తారాబాయ్, వీహెచ్ఎస్ జ్యోతి, హెచ్‌ఈవో యాదగిరి, ఎంపీహెచ్ఎస్ ప్రసాద్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: ఈ నెల 3 నుంచి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్నిను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి సంపత్ కుమార్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లకు గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలు పోలియో బారిన పడకుండా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. చందుర్తి, రుద్రంగి మండలాల పరిధిలో నాలుగు వేల మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లలను గుర్తించామన్నారు. చిన్నారులకు వ్యాక్సిన్ ఇవ్వడానికి పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

ముస్తాబాద్, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని పులిశేరుకుంట మైసమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. నేటి నుంచి మైసమ్మఆలయ ప్రథమ వార్షికోత్సావాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలయ కమిటీ అడుగగానే కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ కెకె మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చి త్వరగా ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సావాలు మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, వేముల అంజన్నగౌడ్, అన్నం శ్రీధర్‌బాపు, బండారి సత్తయ్య రంజాని నరేశ్, తలారి నర్సింలు, తాళ్ల విజయ్‌రెడ్డి, ఉచ్చిడి బాల్‌రెడ్డి, కొమురయ్య, నల్ల నర్సయ్య, ఆగుళ్ల రాజేశం, సత్యం, తాళ్ల రాజు, శ్యాగ మహేశ్, దశరథం, మాదాసు అనిల్, కొండయ్య, తాళ్ల శ్రీను, కంతుల భాస్కర్ పాల్గొన్నారు.

మురికి కాలువలోని మట్టిని తొలగించండి

రుద్రంగి ఫిబ్రవరి 29: మండలం కేంద్రంలో మట్టితో పూడ్చివేసిన మురికికాలువను శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల ప్రచారం కోసం రుద్రంగిలో బస్ స్టాండ్ ప్రాంతంలోని ప్రధాన మురికి కాలువను మొరం మట్టితో మూసివేశారు. మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మురికికాలువలో నింపిన మొరం మట్టిని తీయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురికి కాలువలో నింపిన మొరం మట్టిని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మురికి కాలువలో నింపిన మొరం మట్టి